సాక్షి
తిరుపతి
బుధవారం । 19 । జూన్ । 2024



శ్రీవారి సేవలో ప్రముఖులు
తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికారు. - 8లో



మందుబాబులకు కౌన్సెలింగ్
జిల్లావ్యాప్తంగా పోలీసులు సోమవారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. - 8లో



'స్పందన'లేక ఖాళీగా కలెక్టరేట్
ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి కలెక్టరేట్‌లో అధికారులు స్పందన కార్యక్రమం నిర్వహించడం లేదు. - 8లో

న్యూస్‌రీల్

భక్తుల సౌకర్యార్థం 'కూల్ పెయింట్'



మాడవీధుల్లో వేసిన కూల్ పెయింట్

తిరుమల : తిరుమలలో భక్తుల సౌకర్యార్థం ఎండకు ఇబ్బంది పడకుండా పలు మార్గాల్లో మంగళవారం ఇంజినీరింగ్ అధికారులు వైట్ కూల్ పెయింట్ వేశారు. సోమవారం గోకులం విశ్రాంతి భవనంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు టీటీడీ ఈఓ శ్యామలరావు ఆదేశించారు. వైట్ కూల్ పెయింటింగ్ పనులు వెంటనే చేపట్టాలని స్పష్టం చేశారు. దీంతో అధికారులు హుటాహుటిన శ్రీవారి ఆలయం ఎదుట, బేడి ఆంజనేయ స్వామి ఆలయం, వాహన మండపం, రాంభగీచా, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే నాలుగు మాడ వీధుల్లో వైట్ కూల్ పెయింట్ వేయించారు.

జూలై 19న పులికాట్ పరిస్థితిపై ప్రజాభిప్రాయ సేకరణ



పంచాయతీ కార్యదర్శులకు ప్లాన్ పత్రాలు అందిస్తున్న కిషోర్

తడ: కోస్టల్ జోన్‌లోని పులికాట్ సరస్సు పరిధి, పరిస్థితి, చేపట్టాల్సిన అభివృద్ధి, అభ్యంతరాలపై జూలై 19వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు తిరుపతి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనలిస్ట్ కిషోర్ తెలిపారు. మంగళవారం తడ ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తిరుపతి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నామన్నారు. పులికాట్ కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌కి సంబంధించి దొరవారిసత్రం మండలంలోని నేలపట్టులో గ్రామసభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పులికాట్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల్లోని తీర ప్రాంత వాసుల అభిప్రాయాలు సేకరించి నివేదిక పంపనున్నట్లు వివరించారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులకు ప్లాన్ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీకృష్ణ, ఎంపీపీ కొళవి రఘురెడ్డి, వైస్ ఎంపీపీ కుప్పంపాటి వెంకటేష్ పాల్గొన్నారు.

'టేక్ హోమ్ రేషన్' తప్పనిసరి



జయలక్ష్మి, స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి

తిరుపతి అర్బన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తప్పనిసరిగా టేక్ హోమ్ రేషన్ అందించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి జయలక్ష్మి ఆదేశించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి వారంలోనే వందశాతం టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో 12,750 మంది గర్భిణులు, 11,509 బాలింతలు, 1,13,202 మంది చిన్న పిల్లలున్నారని వివరించారు. 2,492 అంగన్‌వాడీ సెంటర్లలో 2,090 అంగన్‌వాడీ టీచర్లు, 348 మినీ అంగన్‌వాడీ టీచర్లు, 2,066 మంది హెల్పర్లు పనిచేస్తున్నారన్నారు. ప్రతి నెల 15 రోజులకు ఒకసారి టేక్ హోమ్ రేషన్ పంపిణీని సీడీపీఓలు పరిశీలించాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో నాలుగు సెంటర్ల చొప్పున తాను సైతం జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతుంటే వెంటనే తమకు సమాచారం అందించాలని స్పష్టం చేశారు.

ముక్కంటి సేవకు పోటెత్తిన భక్తులు



క్యూలో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. సుమారు 26వేల మంది తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం ద్వారా 1,550మంది, రూ.50 ప్రత్యేక దర్శనం ద్వారా 2,700మంది భక్తులు సేవించుకున్నట్లు వెల్లడించారు. రూ.500 రాహుకేతు పూజల్లో 2,725మంది, రూ.750 పూజల్లో 1,185 మంది, రూ.1,500 పూజల్లో 308 మంది, రూ.2,500 పూజల్లో 270 మంది, రూ.5వేల పూజల్లో 73మంది భక్తులు పాల్గొన్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే 18,427 ప్రసాదాలు అమ్ముడైనట్లు తెలిపారు.

పార్ట్‌టైమ్ మోసం!



- చిత్తూరు నగరంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన యువతి రెండు నెలలుగా ఇంటి వద్దే ఖాళీగా ఉంటోంది. ఆన్‌లైన్‌లో జాబ్ కోసం వెతుకుతూ ఓ వెబ్ లింక్ క్లిక్ చేసింది. ప్రతిగా వారు ఇంటి వద్ద ఉంటూనే మీరు కొంత సొమ్ము పెట్టుబడిగా పెడితే అంతకు రెట్టింపు వస్తుందని నమ్మబలికారు. మొదట్లో కొంత సొమ్మును ఖాతాకు పంపించారు. తర్వాత విడతల వారీగా రూ.3 లక్షల వరకు వసూలు వేశారు. తర్వాత వారి నంబర్లు, వాట్సాప్ గ్రూపులు బ్లాక్ చేశారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.
- గుడిపాల మండలానికి చెందిన ఓ ప్రభుత్వోద్యోగి. నెలకు వేలల్లో సంపాదన. అయినా ఖాళీ సమయంలో డబ్బులు సంపాదించాలనే ఆశతో వర్క్ ఫ్రమ్ హోమ్ పేరిట ఆన్‌లైన్ టాస్క్‌లో పాల్గొన్నాడు. మొదట్లో డబ్బులు వస్తున్నట్లే వచ్చి, చివరికి రూ.4 లక్షల వరకు పోగొట్టుకుని బోరుమన్నాడు.
- పలమనేరు పట్టణంలోని తాలూకచ్చేరి కాలనీకి చెందిన ఇంజినీరింగ్ పూర్తి చేసిన యువతి పత్రికల్లో వచ్చిన ఆన్‌లైన్ ఉద్యోగ ప్రకటన చూసింది. అది మోసపూరితమైందా… కాదా అన్నది తెలుసుకోకుండానే రూ.లక్షల్లో వేతనం ఉంటుందని వారు చెప్పిందల్లా నమ్మి విడతలుగా రూ.2 లక్షల వరకు చెల్లించింది. వారు ఫోన్లు ఎత్తడం మానేయడంతో మోసపోయినట్లు గ్రహించి 1930 సైబర్ సెల్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసింది.
- పూతలపట్టులో ఇంజినీరింగ్ చదివిన ఒక యువతి రూ.2.60 లక్షలు, గంగాధరనెల్లూరులో నిరుద్యోగ యువకుడు రూ.1.60 లక్షలు, పి.కొత్తకోట సమీపంలో ఓ వివాహిత రూ.2.40 లక్షలు.. ఇలాంటి ఆన్‌లైన్ సైట్లు, ఉద్యోగ ప్రకటనలు చూసి మోసపోయారు. ఇటీవలే ఈ ఘటనలన్నీ చోటుచేసుకున్నాయి.

సరికొత్త విధానాలతో సైబర్ నేరగాళ్లు మాయ జేస్తున్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన వారిని సైతం సులువుగా బురిడీ కొట్టిస్తున్నారు. ఉద్యోగాల పేరిట వల విసిరి రూ.లక్షలు దోచేస్తున్నారు. నిరుద్యోగ యువతే లక్ష్యంగా పార్ట్‌టైమ్ జాబ్‌లంటూ మోసం చేస్తున్నారు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని ఆన్‌లైన్ ప్రకటనలతో గారడీ చేసి బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. కేటుగాళ్ల బారిన పడిన బాధితులు చివరకు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

- కూర్చున్నచోటే ఉద్యోగాలంటూ యువతకు గాలం
- చిక్కుకున్నాక రూ.వేల నుంచి రూ.లక్షల్లో దోపిడీ
- జిల్లాలో పెరుగుతున్న ఆన్‌లైన్ జాబ్ బాధితులు
- స్టేషన్‌కు వెళ్లలేక కొందరు.. పరువు కోసం మరికొందరు..

చిత్తూరు అర్బన్: ఇటీవల ఆన్‌లైన్ ఉద్యోగాల బాధితులు పెరుగుతున్నారు. ఆన్‌లైన్ జాబ్ ఫ్రాడ్స్, పార్ట్‌టైమ్ జాబ్‌ఫ్రాడ్స్, డేటా ఎంట్రీ స్కామ్స్, వర్క్ ఫ్రం హోమ్ జాబ్ స్కామ్స్ తరహా మోసాల్లో బాగా చదువుకున్న యువతే చిక్కుకుంటున్నారు. ఆన్‌లైన్ జాబ్ సైట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్, పత్రికల్లో నకిలీ ప్రకటనలు నమ్మి మోసపోతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించాలనే బలహీనత ఉన్న వారు ఇలాంటి మోసగాళ్ల ఉచ్చులో పడి తమ బ్యాంకు ఖాతాలు ఖాళీ చేసుకుంటున్నారు. వీరిలో ఎక్కువ శాతం ఇంజినీరింగ్ చదివిన వారితోపాటు ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ప్రైవేటు ఉద్యోగులు, నిరుద్యోగ యువత ఉండడం గమనార్హం.

వాళ్లే లక్ష్యం..
చాలా మంది ఎక్కువగా ఇంటి వద్ద ఉంటూ పనిచేయడానికే ఇష్టపడతారు. జాబ్ స్కామ్ చేసేవాళ్లు వీరినే టార్గెట్ చేసుకుంటున్నారు. తక్కువ సమయం, తక్కువ శ్రమతోనే నెలకు వేలాది రూపాయలు సంపాదించగల జాబ్స్ తమ వద్ద ఉన్నాయంటూ తరచూ ఆన్‌లైన్‌లో ప్రకటనలు ఇస్తుంటారు. ఎవరైనా వీటిని నమ్మి సంప్రదిస్తే ఫీజులు, చార్జీల రూపంలో డబ్బులు కట్టించుకుని మోసగిస్తారు. ఈ ప్రకటనలు ఆన్‌లైన్‌లోనే కనిపిస్తాయి. వాట్సాప్ ఫార్వర్డ్ రూపంలోనూ ఉంటాయి.

బ్లాక్‌మెయిల్..
డేటా ఎంట్రీ స్కామ్స్ రకరకాలుగా ఉంటాయి. ఎక్కువ స్కిల్స్ అవసరం లేకుండానే సింపుల్ డేటా ఎంట్రీ చేస్తే చాలు డబ్బులు సంపాదించొచ్చని నమ్మబలుకుతారు. ముందుగానే ప్రాసెసింగ్ ఫీజు, ట్రైనింగ్ ఫీజు రూపంలో అడ్వాన్స్ పేమెంట్ చేయించుకుంటారు. డేటా ఎంట్రీ అనంతరం అందులో తప్పులు ఉన్నాయని, దాని వల్ల సంస్థ నష్టపోయిందని, నష్ట పరిహారం చెల్లించాలని, లేకుంటే లీగల్ ప్రొసీడింగ్స్‌కు వెళతామని బెదిరించి అధిక మొత్తంలో తిరిగి డబ్బులు వసూలు చేస్తారు.

నిజం లాంటి అబద్ధం..

నకిలీ ఉద్యోగాల్లో సైబర్ నేరగాళ్ల వద్ద అందరి బయోడేటా ఉంటుంది. ఆన్‌లైన్ జాబ్ సెర్చింగ్ సైట్లకు జనం ఇచ్చే బయోడేటాలు వీరు సేకరిస్తుంటారు. ఒక కాల్ సెంటర్ వంటి సెటప్ ఏర్పాటు చేసుకుని జాబ్ కన్సల్టెన్సీ ముసుగులో వారి నుంచి ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లుగా మోసపూరిత మెయిళ్లను పంపిస్తారు. ఆ మెయిల్‌కు స్పందిస్తే.. అసలైన జాబ్ నిర్వహించే ప్రక్రియనే వీరూ అనుసరిస్తారు. అలా మోసం చేస్తూ నిరుద్యోగి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ చార్జీలు, యూనిఫాం అడ్వాన్స్, సెక్యూరిటీ డిపాజిట్ వంటి పేర్లతో దోచుకుని తర్వాత మాయమైపోతారు.



ఇలా గుర్తించాలి..

- ఉద్యోగ ప్రకటనలు అన్నీ నిజంకావు అనే సత్యాన్ని గ్రహించాలి.
- సాధారణంగా ప్రముఖ సంస్థలు ఎప్పుడూ రిజిస్ట్రేషన్ ఫీజు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఫీజు పేరిట నగదు వసూలు చేయవు.
- ప్రకటనల్లో ఉపయోగించే లోగోలు, లెటర్లను ఒకటికి రెండుసార్లు గమనించాలి.
- అసలైన సంస్థ ఎప్పుడూ ఈ-మెయిల్ ద్వారానే సమాచారం ఇస్తారు. కానీ జాబ్‌స్కామ్/ఫ్రాడ్ చేసేవారు పంపే మెయిల్‌ను గమనిస్తే కాస్త తేడాగా ఉంటాయి.
- జాబ్ స్కామ్ వారు ఇచ్చే ఉద్యోగ ప్రకటనల్లో గానీ, ఈ-మెయిల్స్‌లో గానీ ఎక్కువగా గ్రామర్ తప్పులు ఉంటాయి. జాబ్ డిస్క్రిప్షన్ కూడా అస్పష్టంగా ఉంటుంది.
- క్విక్ మనీ, అన్ లిమిటెడ్ ఎర్నింగ్స్, ఎలాంటి టెక్నికల్ స్కిల్స్ అవసరం లేదు అనే పదాలు చూసిన వెంటనే అప్రమత్తమవ్వాలి. ఒక చట్టబద్ధమైన సంస్థ ఎప్పుడూ ఇలాంటివి చేయదన్నది గ్రహించాలి.
- ఈ తరహా మోసాలకు గురయ్యేవారు 1930 సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేయాలి. మీ పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి.

చదువుకున్న వాళ్లు ఇలాగా?



విద్యావంతులు, యువతీ యువకులు ఉద్యోగాల కోసం డబ్బులు ఇవ్వడం అనేది తప్పు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం డబ్బులు తీసుకోవడం ఎంత నేరమో, ఇవ్వడం కూడా అంతే నేరం. నగదు తీసుకున్న వారితో పాటు ఇచ్చిన వారిపై కూడా క్రిమినల్ కేసులు పెడతాం. ఇక ప్రైవేటు రంగాల విషయానికి వస్తే.. మీలో నైపుణ్యం పెంచుకోవడానికి కోచింగ్ సెంటర్‌కు వెళ్లి కొత్త కోర్సులు నేర్చుకోవడానికి డబ్బులు పెట్టండి. అంతేగానీ, పరిచయంలేని వ్యక్తులకు ఎందుకు రూ.లక్షలు ఇస్తున్నారో తెలియడంలేదు. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఏం చేస్తుంటారన్నది గ్రహిస్తే మంచిది. ఆన్‌లైన్ జాబ్ ప్రకటనలు ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలి. మోసపోయామని గ్రహిస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ధైర్యంగా ఫిర్యాదు చేయండి. కేసు నమోదు చేస్తాం.

– మణికంఠ, ఎస్పీ, చిత్తూరు

తిరుపతి ఐఐటీలో ఇన్నోవేషన్ వర్క్‌షాప్



విద్యాసంస్థలు, ప్రయోగశాలల ప్రతినిధులతో డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు : తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో అన్‌లాకింగ్ బ్యాటరీ ఇన్నోవేషన్స్‌పై వాటాదారుల వర్క్‌షాపును మంగళవారం నిర్వహించారు. ఐఐటీ, ఐసర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ సమావేశంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ బ్యాటరీ తయారీ, సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహించడంపై దేశం దృష్టి సారించిందన్నారు. బ్యాటరీ తయారీ కోసం ర్యాపిడ్ ప్రోటో టైప్ సెంటర్(ఆర్‌పీసీ)ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యాచరణ పద్ధతులు, సౌకర్యాలను అర్థం చేసుకోవడమే ఈ సమావేశం లక్ష్యమన్నారు. ఆర్‌పీసీ స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈ, ఉత్పాదక సంస్థలకు వాణిజ్య ఉత్పత్తి సముదాయం స్థాపించడం, వాణిజ్య సెల్ తయారీ, కొత్త సాంకేతికతలను మూల్యాంకనం చేయడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని వెల్లడించారు. దేశంలో బ్యాటరీ తయారీ, పర్యావరణ వ్యవస్థ, అభివృద్ధిపై వివిధ పరిశ్రమలు, ప్రభుత్వ ఏజెన్సీలతో చర్చలు జరుపుతున్నట్లు వివరించారు. బ్యాటరీ తయారీ, మెటీరియల్స్, సప్లై చైన్, ఎక్విప్‌మెంట్ తయారీ, స్టార్టప్‌లు తదితర అంశాలపై చర్చించారు. డాక్టర్ అనితా గుప్తా మాట్లాడుతూ భారతదేశం నిర్దేశించిన ప్రతిష్టాత్మకమైన నికర జీరో లక్ష్యాలను సాధించడంలో ఈవీ టెక్నాలజీలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఐసర్ డైరెక్టర్ శాంతన భట్టాచార్య మాట్లాడుతూ దేశంలో కణాల తయారీని పెంపొందించడం, ప్రోత్సహించడం, అభివృద్ధి చేయడానికి ఇలాంటి కేంద్రం అవసరమన్నారు. సమావేశానికి దేశంలోని వివిధ ప్రయోగశాలలు, విద్యాసంస్థల నుంచి 60 మంది ప్రతినిధులు హాజరైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ రఘునాథన్, ఐఈఎస్ఏ అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ వాలావలకర్, డీఎస్టీ శాస్త్రవేత్త సురేష్ బాబు, ప్రొఫెసర్లు విజయ్, మోగేష్ శర్మ, శశిధర్ గుమ్మ పాల్గొన్నారు.

నృసింహుని హుండీ లెక్కింపు



రాపూరు : పెంచల కోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనృసింహస్వామి ఆలయ హుండీలను మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా డీసీ విజయసాగర్ మాట్లాడుతూ 35 రోజులకు గాను శ్రీవారికి రూ.86,46,905 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. అలాగే 130 గ్రాముల బంగారం, 3.7 కేజీల వెండి వచ్చిందన్నారు. కార్యక్రమంలో రాజరాజేశ్వరీదేవి ఆలయ ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి



కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి తుడా: తిరుపతి స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ చైర్మన్, కలెక్టర్ ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్మార్ట్ సిటీ బోర్డ్ సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుల వివరాలను స్మార్ట్ సిటీ ఎండీ అదితీ సింగ్ తెలియజేశారు. ఐ ట్రిపుల్ సి నిర్మాణాలు, సిటీ ఆపరేషన్ సెంటర్, మల్టీ లెవల్ పార్కింగ్ పనులపై చర్చించారు. స్మార్ట్ సిటీ బోర్డు డైరెక్టర్లు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి రవిచంద్ర, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, తుడా వైస్ చైర్మన్ వెంకట నారాయణ, రామచంద్రారెడ్డి, రమాశ్రీ , స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఎస్ఈ తిరుమాలిక మోహన్ పాల్గొన్నారు.

బాబు గారి 'భరోసా' ఎప్పుడో?

- పీఎం కిసాన్ సొమ్ము విడుదల
- జిల్లాలో 1,89,209 మంది అన్నదాతలకు లబ్ధి
- రూ.2వేల చొప్పున రూ.495.31 లక్షలు జమ
- చంద్రబాబు హామీ ఇచ్చిన రూ.20వేల పెట్టుబడి సాయం కోసం రైతుల ఎదురుచూపు



శ్రీకాళహస్తి మండలం బందారుపల్లెలో దుక్కి దున్నుతున్న రైతు


తిరుపతి అర్బన్ : ఖరీఫ్ సీజన్‌లో సేద్యం పనుల కోసం పుడమి పుత్రులు పొలం బాట పడుతున్నారు. పంటల సాగుకు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలోనే ఏటా ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని మంగళవారం విడుదల చేసింది. అయితే కొత్తగా పగ్గాలు చేపట్టిన టీడీపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఏటా రూ.20వేల పెట్టుబడి సాయంపై ఇప్పటికీ ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఖరీఫ్ సాగు ప్రారంభించిన రైతులు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారు. త్వరగా ఇస్తే సాగుకు వెసులుబాటుగా ఉంటుందని ఆశపడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కలిపి రైతులకు ఏటా రూ.13,500ను మూడు దఫాలుగా అందించేది. దీంతో అన్నదాతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతగా మేలో రూ.5500 రైతుల ఖాతాల్లో జమ చేస్తుండేది. దీంతో చిన్న, సన్నకారు, పేద రైతులకు పెట్టుబడికి ఢోకా ఉండేది కాదు. జిల్లాలో వైఎస్సార్ రైతు భరోసా కింద ఏడాదికి సుమారు 1,89,209 మందికి నిధులు జమ చేశారు. ఐదేళ్లలో వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కలిపి రూ.750.58 కోట్లు ప్రోత్సాహ నిధిగా అందజేశారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల కారణంగా పీఎం కిసాన్ నిధి ఆలస్యంగా జూన్‌లో జమ చేశారు. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులకు రూ.20 వేలకు సంబంధించి ఇప్పటి వరకూ జీఓ విడుదల కాకపోవడం గమనార్హం.

హామీ నిలబెట్టుకోవాలి
చంద్రబాబు ఇచ్చిన రైతు భరోసా హామీని నిలబెట్టుకోవాలి. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి సీజన్ వాటా రూ.2 వేలను కేంద్ర ప్రభుత్వం జమ చేసింది. రాష్ట్రంలో అధికారం చేపట్టిన నూతన ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రూ.20 వేల హామీకి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన రాలేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో వెంటనే జీఓ విడుదల చేసి, నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలి.
– వెంకటయ్య, రైతు, చంద్రగిరి

త్వరగా సాయం అందించాలి
కొత్త ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి విడుదలైన నేపథ్యంలో ఏటా రూ.20వేలు ఇస్తామన్న చంద్రబాబు త్వరగా స్పందించి సాయం అందించాలి. కేంద్రంతోపాటు రాష్ట్రం కూడా రైతులకు భరోసా కల్పించాలి. లేకుంటే అన్నదాతలకు పంటల సాగులో ఇబ్బంది వస్తుంది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
– చెంచయ్య, రైతు, ఏర్పేడు

'సుందరం'.. సుమనోహరం

- వైభవంగా శ్రీపద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు
- రెండోరోజు పుష్కరిణిలో విహరించిన సుందరరాజస్వామివారు



పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న స్వామివారు (ఇన్‌సెట్) హారతి సమర్పిస్తున్న అర్చకుడు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం శ్రీసుందరరాజస్వామివారు తెప్పపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ముఖ మండపంలో స్వామివారికి అభిషేకం జరిపించారు. సాయంత్రం 6.30 నుంచి 7.15 గంటల వరకు కనులపండువగా తెప్పోత్సవం నిర్వహించారు. సర్వాలంకాభూషితులైన స్వామివారు పద్మసరోవరంలో మూడు ప్రదక్షిణలు చేస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శ్రీసుందరరాజస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. తెప్పోత్సవాల్లో మూడోరోజు బుధవారం శ్రీపద్మావతి అమ్మవారు తెప్పపై విహరించనున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ గోవింద రాజన్, సూపరిండెంట్ మధు, అర్చకులు బాబు స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సుభాష్, గణేష్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పొనగల్ గంగమ్మకు ముక్కంటి సారె





ప్రత్యేక అలంకారంలో గంగమ్మ , సారె తీసుకెళుతున్న ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు తదితరులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పొనగల్‌లో వెలసిన గంగమ్మకు జాతర సందర్భంగా మంగళవారం శ్రీకాళహస్తీశ్వరుని తరఫున సారె సమర్పించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలోని అలంకార మండపం వద్ద సారెకు పూజలు చేశారు. అనంతరం పొన్నాలమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ముక్కంటి సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. జాతర సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, సత్రవాడ ప్రవీణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'స్పందన' లేక ఖాళీగా కలెక్టరేట్


జనం లేక బోసిపోతున్న కలెక్టరేట్

తిరుపతి అర్బన్ : తిరుపతి కలెక్టరేట్ ఖాళీగా దర్శనమిస్తోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మార్చి 16వ తేదీన ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినప్పటి నుంచి 12 వారాలుగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేశారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో స్పందనకు బదులుగా కొత్త పేరుతో అర్జీలను స్వీకరించనున్నట్లు చర్చ సాగుతోంది. ఈ తరుణంలో అర్జీలతో వెళ్లినా ఎలాంటి ప్రయోజనం ఉండదని జిల్లా ప్రజలు కలెక్టరేట్ వైపు రావడం లేదు. మరోవైపు జిల్లా అధికారులతోపాటు డివిజన్, మండల స్థాయి అధికారులు అతి త్వరలో బదిలీ బాట పట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ సమయంలో కలెక్టరేట్‌లో పట్టించుకునే వారు ఉండరని జనం భావిస్తున్నారు. నిత్యం వివిధ పనుల నిమిత్తం వచ్చేవారితో రద్దీగా ఉండే కలెక్టరేట్ ఇప్పుడు బోసిపోతోంది.

238 మంది మందుబాబులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్ : జిల్లావ్యాప్తంగా సోమవారం రాత్రి పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి సుమారు 238 మంది మందుబాబులు పట్టుబడ్డారు. వీరికి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. రాత్రి వేళ సంచరించకూడదని, మద్యం తాగి వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధమని వెల్లడించారు. దీనిపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ జిల్లాలో ఇలాంటి తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహిస్తామన్నారు. ఈ వారంలోనే 730 మందికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. 32 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కూడా నమోదు చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు దాదాపు 398 గ్రామాల్లో సైతం తనిఖీలు నిర్వహించినట్లు వివరించారు. సమస్యాత్మక గ్రామాల్లో రాత్రిపూట బస చేసి ప్రజలకు భరోసా కల్పించనున్నట్లు తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తమిళ జాలర్ల దోపిడీ

- నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్ బోట్ల వినియోగం
- సరిహద్దులు దాటి వేట సాగిస్తున్న వైనం
- స్థానిక మత్స్యకారుల ఆందోళన


తూపిలిపాళెం వద్ద చేపల వేటలో స్థానిక మత్స్యకారులు


జిల్లా తీరంలో స్పీడు బోట్లతో వేట సాగిస్తున్న తమిళ జాలర్లు

వాకాడు : ఉమ్మడి జిల్లా తీరం వెంబడి మూడు రోజులుగా తమిళ జాలర్ల దోపిడీ కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్ బోట్లతో సముద్రంలోని మత్స్య సంపదను గాలించి యథేచ్ఛగా దోచుకెళుతున్నారు. దీంతో 12 తీర ప్రాంత మండలాల్లోని 118 గ్రామాల మత్స్యకారులు వేట విరామం తర్వాత ఒక్క చేప కూడా దొరక్క అల్లాడిపోతున్నారు. జిల్లాలోని 169 కిలోమీటర్ల సముద్ర తీరంలో 29 వేల మంది మత్స్యకారులు ఉన్నారు. వీరికి దాదాపు 5 వేల వరకు ఇంజిన్ బోట్లు ఉన్నాయి. మత్స్యకారులు మూడు రోజులుగా సముద్రంలో ఎంత గాలించినా ఒక్క చేప కూడా చిక్కడంలేదు. తమిళనాడులోని కడూరు, నాగూరు నాగపట్నం, తూత్తుకుడి తదితర ప్రాంతాలకు చెందిన జాలర్లు ప్రత్యేకంగా తయారు చేసిన వలలతో స్పీడు బోట్లు ద్వారా హద్దులు దాటి జిల్లా పరిధిలని సముద్రంలోకి చొరబడుతున్నారు. చిన్న సైజు చేపలతో సహా పట్టుకుని వెళ్లిపోతున్నారు. దీంతో జిల్లాలోని మత్స్యకారులకు కనీసం బోటు ఆయిల్ ఖర్చులు కూడా గిట్టుబాటు కావడంలేదు. దీంతో చాలా మంది వేట నిలిపేసి ఇంటికే పరిమితమవుతున్నారు. సాధారణంగా సముద్రంపై వేట సాగించే మత్స్యకారులు 4 అంగుళాలకు పైగా రంధ్రాలు గల వలను మాత్రమే వినియోగించాలి. అయితే తమిళ జాలర్లు నిబంధనలకు విరుద్ధంగా ఒక ఇంచు సైజు రంధ్రాలతో తయారు చేసిన 100 మీటర్ల వలతో వేటకు రావడంతో చిన్న చిన్న నలక చేపలతోపాటు పెద్ద పెద్ద చేపలు సైతం వలకు చిక్కుతున్నాయి. వాస్తవానికి స్పీడు బోట్లతో జాలర్లు 8 నాటికల్ మైళ్ల దూరం వెళ్లి సముద్రంలో వేట సాగించాలి. తమిళ జాలర్లు ఈ నిబంధనలను బేఖాతరు చేసి 3 నాటికల్ మైళ్ల దూరంలో కూడా వేట సాగిస్తున్నారు. దీంతో స్థానిక మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

సముద్రంపై హోరు గాలి

ఈ క్రమంలోనే వేట విరామం తర్వాత మూడు రోజులుగా సముద్రంపై ప్రతికూల వాతావరణం కనబడుతోంది. హోరు గాలి కారణంగా వేట సాగడం లేదు. సాధారణంగా సముద్రంలో వేట విరామం అనంతరం చేపలు ఎక్కువగా దొరుకుతాయని మత్స్యకారులు భావిస్తుంటారు. కానీ, ఈ పర్యాయం మత్స్యకారుల ఆశలు అడియాశలుగా మారాయి. పొద్దస్తమానం సముద్రంలో వలలు వేసి గాలించినా ఒక్క చేప కూడా దొరకపోగా శ్రమతోపాటు, డీజిల్ ఖర్చులు పెరిగిపోతున్నాయి. దీంతో మత్స్యకారులు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడాల్సి వస్తోంది.

'పేట' టీడీపీలో కుంపటి!

- వర్గాల వారీగా విడిపోయిన తమ్ముళ్లు
- పోటీగా పార్టీ కార్యాలయం ఏర్పాటుకు శ్రీకారం


మాట్లాడుతున్న నెలవల సుబ్రమణ్యం

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేటలో టీడీపీ నేతలు మధ్య వర్గపోరు మొదలైంది. పట్టణంలో పాతికేళ్లుగా పార్టీ కార్యాలయం ఉండగా, పోటీగా మరో ఆఫీస్ ప్రారంభించేందుకు మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం సన్నద్ధమవుతున్నారు. మంగళవారం ఈ మేరకు టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ ఇంటి వద్ద విలేకర్ల సమావేశం నిర్వహించి మరీ ప్రకటించారు. దీంతో టీడీపీలో విభేదాల కుంపటి రాజుకుంది. గతంలో వేనాటి రామచంద్రారెడ్డి, కొండేపాటి గంగాప్రసాద్ వర్గాల నడుమ ఆధిపత్య పోరు సాగేది. నెలవల విజయశ్రీకి టికెట్ ఇప్పించడంలో గంగాప్రసాద్ కీలక పాత్ర పోషించారు. దీంతో వేనాటి రామచంద్రారెడ్డి పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు. అయితే రామచంద్రారెడ్డి అన్న మునిరెడ్డి కుమారుడు వేనాటి సతీష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి టీడీపీలోనే ఉండిపోయారు. ఈ ఎన్నికల్లో సైతం పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు ముమ్మరంగా కృషి చేశారు. అయితే విజయశ్రీ విజయం సాధించిన తర్వాత వేనాటి వర్గీయులకు నెలవల దూరమయ్యారు. వేనాటి వారికి పోటీగా టీడీపీ నూతన కార్యాలయం ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు కొండేపాటి గంగాప్రసాద్ నివాసం వద్దే తమ నిర్ణయం ప్రకటించారు.

ఇంటి గోడ కూలి ఒకరి మృతి

చంద్రగిరి: మండలంలోని నరసింగాపురంలో ఓ ఇంటి గోడ కూలి గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. వివరాలు.. నరసింగాపురం రైల్వే స్టేషన్ మార్గంలోని పూరిగుడిసెలో బాబు (58) అనే వ్యక్తి నిద్రిస్తుండగా సోమవారం గోడ కూలి అతడిపై పడింది. తీవ్రంగా గాయపడిన బాబును తిరుపతి రుయాకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిశోధనలకు రూ.50లక్షలు



అధ్యాపకులను అభినందిస్తున్న వీసీ డి భారతి

తిరుపతి సిటీ: శ్రీపద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్‌కు చెందిన 14మంది అధ్యాపకులకు పలు పరిశోధన ప్రాజెక్టుల కోసం రూ.50లక్షలు మంజూరయ్యాయి. రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్ష అభియాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేసింది. ఈ సందర్భంగా మంగళవారం ఈ ప్రాజెక్టులను సాధించిన అధ్యాపకులను వీసీ భారతి ప్రత్యేకంగా అభినందించారు.

చేపల వేట అడ్డుకుంటున్నారని ఫిర్యాదు

చిల్లకూరు : మండలంలోని ముత్యాలపాడు చెరువులో చేపల వేటను అడ్డుకుంటున్నారని మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు పామంజి రాఘవయ్య ఆరోపించారు. మంగళవారం విజయవాడలోని మత్స్యశాఖ కమిషనర్ సూర్యకుమారికి ఫిర్యాదు చేశారు. రాఘవయ్య మాట్లాడుతూ సొసైటీలో 120 మంది సభ్యులు ఉన్నారని, గతంలో పీఎంఎంఓ ద్వారా చెరువులో 5లక్షల చేపపిల్లలను వదలిపెట్టామన్నారు. ఇప్పుడు ఆ చేపలను పట్టుకునేందుకు వెళితే బయటి వ్యక్తులు అభ్యంతరపెడుతున్నారన్నారు. తమకు ఆ చెరువులో చేపలు పట్టుకునే హక్కులేదని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డివిజన్, జిల్లా మత్స్యశాఖాధికారలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. ఈ విషయమై విచారణ చేయిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: తిరుమల శ్రీవారిని మంగళవారం తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సినీ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ సేవించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.


శ్రీవారి ఆలయం వెలుపల త్రివిక్రమ్ శ్రీనివాస్

బంగారు భవితకు 'డీ ఫార్మసీ'



తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఫార్మసీ బ్లాక్


ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థినులు (ఫైల్)

- రెండేళ్ల కాలపరిమితితో కోర్సు
- ఉద్యోగ, ఉపాధికి అధిక అవకాశాలు

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు డిప్లొమా ఇన్ ఫార్మసీ (డీ ఫార్మసీ) కోర్సు దోహదపడుతోంది. రెండేళ్ల కాల పరిమితి గల ఈ కోర్సును అభ్యసించడం ద్వారా విద్యార్థులకు అధికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఫార్మసీ రంగంలో స్థిరపడేందుకు ఇది ఉత్తమమైన కోర్సు అని నిపుణులు పేర్కొంటున్నారు. ఔషధ రంగంలో వృత్తి నిపుణులను తీర్చిదిద్దేందుకు ఈ కోర్సు దోహదపడుతుంది.

ఉద్దేశం ఇదీ..

ఔషధ తయారీ, వాటిని పరీక్షించడం, మెడికల్ స్టోర్స్) నిర్వహణ, ఔషధాలను ఎలా పంపిణీ చేయాలి అనే విషయాలపై సమగ్ర అవగాహనే ఈ కోర్సు ఉద్దేశం. రెండేళ్లపాటు విద్యార్థులకు ఈ అంశాల్లో శిక్షణ ఇస్తారు.

ఉద్యోగావకాశాలు..

కోర్సు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఈఎస్ఐ, రైల్వే ఆస్పత్రులు, ప్రైవేటు హాస్పిటల్స్, మెడికల్ షాపులు, ఫార్మా కంపెనీల్లో ఫార్మాసిస్టులుగా ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి. అలాగే సొంతంగా మెడికల్ షాపులు నిర్వహించుకోవచ్చు. అలాగే బీఫార్మసీ కోర్సులో చేరవచ్చు.

అర్హతలు ఇవీ..

డీ ఫార్మసీ కోర్సులో చేరేందుకు ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ చేసిన రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఓపెన్ స్కూల్స్ ద్వారా ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడం ద్వారా అడ్మిషన్ పొందవచ్చు.

చక్కటి అవకాశాలు

విద్యార్థులు తక్కువ సమయం, ఖర్చుతో జీవితంలో త్వరగా స్థిరపడేందుకు డీ ఫార్మసీ కోర్సు చాలా ఉత్తమం. తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో 1964లో ప్రారంభించిన ఈ కోర్సు ద్వారా ఇప్పటి వరకు దాదాపు 60వేల మంది విద్యార్థులను ఫార్మాసిస్టులుగా అవకాశం పొందారు. వీరిలో చాలా మంది ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో రాణిస్తున్నారు. ఆసక్తి గల విద్యార్థులు పూర్తి వివరాలకు 99667 61446, 99088 57585 నంబర్లలో సంప్రదించవచ్చు.

– కృష్ణమూర్తి నాయుడు, హెచ్‌ఓడీ, ఫార్మసీ విభాగం, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్, తిరుపతి

'పీఎం కిసాన్' ప్రత్యక్ష ప్రసారం


మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు, రాస్ నిర్వాహకులు

తిరుపతి అర్బన్ : పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద నిధులు విడుదల కార్యక్రమాన్ని తిరుపతిలోని రాస్ కేంద్రంలో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు కలిసి వీక్షించారు. అనంతరం కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్, ఫసల్ బీమా యోజన, సాయిల్ హెల్త్ కార్డు స్కీమ్, నమో డ్రోన్ దీదీ స్కీమ్, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిరుధాన్యాల సాగు పెంచేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు మాట్లాడుతూ పీఎం కిసాన్ నిధి కింద ప్రతి రైతుకు రూ.2వేల చొప్పు కేంద్ర ప్రభుత్వం జమ చేసినట్లు వెల్లడించారు. పంటల సాగు పెట్టుబడికి వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ పొందిన కృషి సఖి మహిళలకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ జనరల్ సెక్రెటరీ, రాస్ చైర్మన్ వెంకటరత్నం, డాక్టర్ సి.రమణ, డీఆర్‌డీఏ పీడీ ప్రభావతీరెడ్డి, సెరికల్చర్ జిల్లా అధికారి గీతారాణి, ఆత్మ డిప్యూటీ సంచాలకులు రత్న ప్రసాద్, పద్మావతి పాల్గొన్నారు.

గోరక్షశాల..!

- కాణిపాకంలో మూగజీవులకు ఊపిరి పోస్తున్న గోశాల
- భక్తుల సహకారంతో గో సంరక్షణ
- దత్తత పేరిట పేద రైతులకు కోడె దూడలు, ఎద్దులు



కాణిపాకం: పాడి, పంటకు గ్రామీణ భారతంతో విడదీయరాని సంబంధం ఉంది. ఆరోగ్యకర మానవ సమాజ నిర్మాణంలో జంతువుల స్థానం ఎంతో విశిష్టమైనది. అందులోనూ హైందవ ధర్మంలో గోవులకు ఎంతో ప్రాధాన్యత ఉంది. సాక్షాత్తు దేవతామూర్తిగా గోపూజ చేయడం భారతీయ సంప్రదాయం. ఇలాంటి గోవులకు గోసంరక్షణ కేంద్రాలు తమవంతు సేవలతో ఆదరిస్తున్నాయి. ఇదే రీతిలో కాణిపాక దేవస్థానం గోశాల సేవలతోనూ భక్తుల నుంచి ప్రశంసలు అందుకుంటోంది. భక్తుల సహకారం గోశాల గ్రాసానికి ఢోకా లేకుండా చూస్తోంది. ఫలితంగా అటు పేద రైతులకు..ఇటు ఆలయానికి పలు విధాలుగా ఉపయోకరంగా మారింది.

26 ఆవులతో మొదలై 187కు చేరిన గోవులు

కాణిపాకంలోని స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి 2008లో కొందరు భక్తులు గోదానం చేశారు. ఇలా అందిన మొత్తం 26 ఆవుల సంరక్షణకు ఓ షెడ్డును నిర్మించి గోశాలగా నామకరణం చేశారు. ఇప్పుడు ఈ గోశాలలో దేశీయ, గిర్, పుంగనూరు, ఒంగోలు, జెర్సీ, హెచ్ఎఫ్ తదితర జాతులకు సంబంధించిన ఆవులు, ఎద్దులు, దూడలు కలిపి మొత్తం 187 వరకూ ఉన్నాయి. ఇందులో పాలిచ్చే ఆవులు రోజూ 30 నుంచి 35 లీటర్ల పాలు ఇస్తున్నాయి. ఈ పాలను మూలస్థానంలోని స్వామి నిత్యాభిషేకం, నివేదనలకు వినియోగిస్తున్నారు. అలాగే అనుబంధ శ్రీవీరాంజనేయస్వామి, వరదరాజస్వామి, శ్రీమణికంఠేశ్వరస్వామి ఆలయాలకు కూడా పాలను సరఫరా చేస్తున్నారు. గోవులకు పచ్చిగడ్డితో పాటు ఎండు గడ్డి, దాణాను ఆలయ అధికారులే సమకూరుస్తున్నారు. అయితే గోవుల సంఖ్య క్రమేణా పెరగడంతో గోశాలలో ఉన్న మూడు షెడ్లు సరిపోని పరిస్థితి ఉంటోంది. కొత్తగా షెడ్డు నిర్మాణానికి 10 ఎకరాల భూమి అవసరమని ఇదివరకే అధికారులు కమిటీలో ప్రస్తావించారు. దీని అభివృద్ధికి పూర్తి స్థాయిలో అధికారులు దృష్టి సారించి 2020లో గోసంరక్షణ ట్రస్టును ఏర్పాటు చేశారు. గోశాలకు రక్షణ నిమిత్తం సీసీ కెమెరాలు కూడా బిగించారు.

గోసంరక్షణకు భక్తుల విరాళాలు

గోసంరక్షణకు భక్తులు భారీ మొత్తంలో విరాళాలు సమర్పిస్తున్నారు. ఇలా ఏటా ట్రస్టుకు రూ. 2కోట్లపైగా విరాళ రూపంలో సమకూరుతోంది. గత ఏడాది గోమాతపూజ, ట్రస్టు నిర్వహణ కింద రూ.2,10,40,877లు చేకూరింది. అయితే నిర్వహణ ఖర్చుకు రూ.82,02,260లు అవుతోందని అధికారులు చెప్పారు.

దత్తతకు కోడెదూడలు, ఎద్దులు

కాణిపాకంలోని గోశాల నుంచి కొన్నేళ్లుగా కోడెదూడలు, ఎద్దులను దత్తతకు ఇస్తున్నారు. వీటిని దత్తతకు పొందాలంటే చిన్నకారు రైతు(హిందువు)లై ఉండాలి. దత్తతకు ఆసక్తి ఉన్న రైతులు ముందుగానే దేవస్థాన కార్యనిర్వహణాధికారి దరఖాస్తు ఇవ్వాలి. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, చిన్నకారు రైతు ధ్రువీకరణ పత్రం నకలు సమర్పించాలి. వీటిని అధికారులు పరిశీలించి గోసంరక్షణ ట్రస్టు, ధర్మకర్తల మండలితో చర్చించి వారి అనుమతితో దత్తత ఇస్తారు. దత్త ఇచ్చిన మరుసటి రోజు నుంచి కోడె దూడలు, ఎద్దులను ఆలయ అధికారులు పర్యవేక్షిస్తూ ఉంటారు. రైతులు దత్తతకు విరుద్ధంగా నడచుకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. ఇప్పటి వరకు 40కిపైగా దత్తత ఇచ్చినట్లు అధికారులు చెప్పారు.

మరింతగా అభివృద్ధి

గోశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాం. మరింతగా అభివృద్ధి చేయడానికి యత్నిస్తున్నాం. త్వరలో గోశాలను 10 ఎకరాలో విస్తరించాలనే ప్రణాళికతో ఉన్నాం. దాతలు సహకరిస్తే వీలైనంత త్వరగా దీనికి పునాదులు వేస్తాం. పశువైద్యాధికారికి నియామకానికి చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో ఆ ప్రక్రియను కూడా పూర్తి చేస్తాం. ప్రస్తుతం గోశాలలోని పశువులకు అగరంపల్లె పశువైద్యాధికారులతో వైద్యసేవలు అందిస్తున్నాం.



– వెంకటేశు, ఈఓ, కాణిపాక దేవస్థానం

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

నాయుడుపేటటౌన్ : మండలంలోని పండ్లూరు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన నట్టేటి చెంగయ్య(72) రోడ్డు పక్కన నడిచి వెళుతుండగా నెల్లూరు నుంచి తిరుపతి వస్తున్న బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో చెంగయ్య అక్కడికక్కడే మరణించాడు. ఏఎస్ఐ ధర్మయ్య ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గంగాధరనెల్లూరు: మండలంలోని చిత్తూరు–పుత్తూరు మార్గంలో రామానాయుడుపల్లె సమీపంలో కారు, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు .. గంగాధరనెల్లూరు మండలంలోని కట్టకిందపల్లె దళిత వాడకు చెందిన రాజేంద్రన్ కుమారుడు సీమోన్ (25) ద్విచక్ర వాహనంలో రామానాయుడుపల్లె వద్ద నుంచి వస్తున్నాడు. గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు, ద్విచక్ర వాహనం ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో సీమోన్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో క్షతగాత్రుడిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్ తెలిపారు.